కథ 2003

2



# స్వేదఫలం

మొలకలపల్లి కోటేశ్వరరావు

"ముంం దా ముసిలోడ్ని మెడబట్టి గెంటెయ్యవే, ఇంక ఇంటి సాయలకి రాకుండా తరిమికొట్టు. వెనకా ముందాడతావే!" కోపంతో బుసకొడుతూ బయట పంచలో వున్న భార్యని ఆదేశిస్తూ అన్నాడు సుబ్బరావు.

దావీదుకి కళ్లంట పటపటా నీళ్లు కారాయి.

వాళ్లచేత అంత పని చేయించుకోకుండా లేచి బయటికి వచ్చి వడివడిగా నడుచుకుంటూ తన గుడిసెకి వెళ్లిపోయాడు. వెళ్లడం వెళ్లడమే గుడిసె ముందు వున్న కుక్కిమంచంలో పడ్డాడు.

మంచంలో పడుకున్నాడన్న మాటేకానీ మన సంతా ముల్లుపెట్టి పొడుస్తున్నట్లు బాధగా ఉంది. ఆందోళనగానూ, అలజడిగానూ, విచారంగానూ వుంది. ప్రశాంతంగా మంచంలో పడుకోలేకపోయాడు.

మంచం మీద నించి లేచి పల్లెలోని సెంటర్ దగ్గర వున్న అంబేద్కర్ విగ్రహం దగ్గరికి వెళ్లి అరుగు మీద కూర్చున్నాడు.

సుబ్బరావు అన్న మాటలే తలపుకొస్తున్నాయి.

ఎంత మాటన్నాడు!

తనకిప్పుడు 73 ఏళ్లు! ఇన్నేళ్లు వచ్చి, ఇంత జీవితం గడిచినా ఎవరితోనూ పన్నెత్తి మాట అనిపించు కున్నవాడు కాదు.

తన జీవితం అంతా గడిచిపోయిందీ, తెల్లారి పోయిందీ వాళ్లింట్లోనే!

సుబ్బరావు తాతకానీ, తండ్రికానీ తనని ప్రేమ గానూ, ఆదరంగానూ చూశారే తప్ప ఏనాడూ చిన్నమాట అని ఎరుగరు!

62 ఏళ్లపాటు తను వాళ్లింట్లో జీతానికి వున్నాడు. తన జీవితం అంతా వాళ్లింట్లో జీతం చేయడంతోనే గడిచిపోయింది.

చివరికి తనకి ఏం మిగిలింది?

తనకి చిన్న గడ్డిపరక విలువ లేదు. గడ్డిపోస కంటే హీనంగా చూడబట్టే తనని అంత మాట అన గలిగాడు.

తను ఎంత కష్టపడ్డాడు. ఎంత చాకిరీ చేసాడు. ఎంతగా రెక్కలు ముక్కలు చేసుకున్నాడు!

దావీదుకి కళ్లలో నీళ్లు సుడులు తిరుగుతుం డగా, గతం కళ్ల ముందు కదలాడింది.

*

అప్పుడు తనకి తొమ్మిదేళ్లు వుంటాయి.

రెండు కుక్కపిల్లల్ని తీసుకొచ్చి గుడిసె ముందు వాటితో ఆడుకుంటూ లోపల అమ్మ లేదని నిర్ధారించు కుని, లోనికి వెళ్లి కుండలోనించి సంకటి తీసుకొచ్చి కుక్కపిల్ల నోట్లో కూరుస్తున్నాడు.

ఇంతలో బయటనించి అయ్య వచ్చాడు.

"మడుసులకే తింటానికి తిండి లేకుండా మల మల మాడి చస్తంటే నీకు కుక్కపిల్లలు కావాల్సి వచ్చినా యంట్రా కుక్కలకొడకా! కానిచ్చి చావు, నిన్ను కాపు గారింటి కాడ వదిలిపెట్టి వస్తా!" అన్నాడు.

అంతకు నాలుగురోజుల ముందు తనని జీతానికి వుంచడానికి తమ ఆసామి సుబ్బయ్యతో మాట్లాడి వచ్చాడు అయ్య.

ఆయన అలాగే పంపించమన్నాడు. ఆ మాట ఇంట్లో చెప్పాడు అయ్య.

జీతానికి వెళ్లాలంటే తెలియనితనంతో తనకి ఒక వైపు ఆనందంగానూ, మరోవైపు భయంగానూ, బెరుగ్గానూ వుంది.

మట్టిబొచ్చె, మట్టిముంతా తీసుకుని అయ్య వెంట సుబ్బయ్యగారింటికి వెళ్లాడు తను.

వాళ్లది కూడా పూరిల్లే.

ఇంటి ముందు పెద్ద బండ వుంటే దాని మీద సుబ్బయ్య చుట్ట తాగుతూ పక్కన మరో ఇద్దరు రైతులు వుంటే వాళ్లతో మాట్లాడుతూ కూర్చుని వున్నాడు.

''ఏరా నిమ్మాయ్...'' అంటూ అయ్యని పలకరించాడు కాపు, వాళ్లతో మాట్లాడుతూనే.

''బుడ్డోడ్ని తీసకొచ్చా కాపా గొడ్లకాడికి!''

''వీడేనా నీ కొడుకు. ఏరా బుడ్డోడా... పడ్డదూడ ఎత్తులేవు. గొడ్లు చేలల్లో పడకుండా జేగర్తగా మలేస్తావంట్రా?''

''ఎందుకు మలెయ్యను కాపా?'' అన్నాడు తను పెద్ద మొనగాడిలా.

''పర్లేదురా, కుర్రోడు గట్టిగానే మాట్లాడతన్నాడు. ఉండాల్సినోడివేరా నువ్వు!'' కాపు మెచ్చుకోలుగా అన్నాడు.

''అయితే జీతం ఎంత కాపా?'' అడిగాడు తను.

ఆమాట అడగడంతోనే సుబ్బయ్య కాపుతోపాటు ప్రక్కన వున్న ఇద్దరు రైతులూ, అయ్యా అందరూ పెద్దగా నవ్వడం మొదలుపెట్టారు.

నవ్వీ, నవ్వీ అలిసిపోయేంతదాకా నవ్వేరు.

''అయితే ఎంతిమ్మంటావురా పొట్టోడా జీతం?'' అడిగాడు కాపు నవ్వుని ఆపుకోలేకపోతూనే.

వాళ్లు అంతగా ఎందుకు నవ్వుతున్నారో తనకి బొత్తిగా అర్థంకాలేదు.

''నీ ఇట్టం కాపా, ఎంతో కొంతియ్యి! నాదేముంది?'' అన్నాడు తను, వాళ్ల నవ్వుతో కొంచెం సిగ్గుపడిపోయి.

''నీకు కూడు పెట్టడమే దండగ అయితే ఇంక జీతం కూడా ఇస్తారంట్రా? ఏదో మన ఆసామి మంచోడు కాబట్టి నీకు ముప్పూటలా కూడు పెట్టి వుంచుకుంటన్నాడు. నువ్వు ఏం పని చేస్తావని నీకు జీతం ఇస్తార్రా పిచ్చినాకొడకా!'' అన్నాడు అయ్య.

కొద్దిసేపు ఆ మాటా ఈ మాటా మాట్లాడుకున్నారు.

''జేగర్త మాట రానీయువాకు. కాపులు మంచోళ్లు. నీకు బువ్వకి లోటు వుండదు!'' అయ్య తనకి చెప్పి, అక్కడ వదిలివెళ్లిపోయాడు.

అదే మొదలు తను జీతానికి వుండటం.

తను గొడ్లని తోలుకుపోయి వాగుల్లోనూ, వంకల్లోనూ మేపుకుని సందకాడికి ఇంటికి తోలుకొచ్చేవాడు.

కుక్కి నులకమంచం, చిరిగిపోయిన పాత జమకాణా ఒకటి తనకి సుబ్బయ్య కాపు భార్య రాజమ్మ ఇచ్చింది. అవి తన పడక!

గొడ్ల సావిట్లో ఆ మంచం వేసుకుని పడుకునేవాడు. ఇంటికి కొద్దిగా ఎడంగా గొడ్లసావిడి వుండేది.

సుబ్బయ్య కాపు మనిషి చాలా మంచివాడు, ధర్మాత్ముడు, మంచీచెడూ తెలుసు.

తనని ముద్దుగా, ''పొట్టోడా... పొట్టోడా...'' అని పిలిచేవాడు.

బరిగొడ్లు మేపుకుని సందకాడికి తను సాలిపోయి ఇంటికి వస్తే రాజమ్మ అమ్మతో చెప్పి తింటానికి ఏవో పెట్టించేవాడు.

జొన్న గుగ్గిళ్లో, కంది గుగ్గిళ్లో, పెసర గుగ్గిళ్లో లేకపోతే జొన్న పేలాలో, జొన్నరొట్టెలో, సజ్జ రొట్టెలో, ఇంటో ఏవి వండితే అవో, ఏం లేకపోతే కందిపప్పో, పరిగ బియ్యమో, కొర్రబియ్యమో తీసుకొచ్చి పెట్టేది.

రాజమ్మ అమ్మ చెయ్యి మంచి చెయ్యి!

సంక్రాంతి పండక్కి అరిసెలు వండితే, ఇరవై రోజులపాటు రోజూ సందకాడ రెండు అరిసెలు ఇచ్చేది.

ఏనాడూ విసుక్కోకుండా మూడుపూటలా కడుపు నిండా కన్నతల్లిలా బువ్వ పెట్టేది.

వచ్చినప్పుడు తను బాన పొట్ట వేసుకుని, మంచి నీళ్ల బానకి పైన రెండూ, కింద రెండూ పుల్లలు అమర్చినట్టు సన్నగా, పీలగా, గోగుపుల్లల్లాంటి కాళ్లూ, చేతుల్తో వుండేవాడు.

అలాంటిది రాజమ్మ అమ్మ తిండి పుణ్యాన బాన పొట్ట కరిగిపోయి, కాళ్లూ చేతులూ కండలు పెట్టి మనిషి అవతారంలోనికి వచ్చాడు.

అన్నీ బాగానే వున్నాయికానీ, సుబ్బయ్య కాపు కొడుకు రాగోలుతోనే తంటా వచ్చిపడింది.

రాగోలు కూడా తన ఈడువాడే!

రాగోలు ఉత్త పోకిరీవాడు. రోజూ తనని చావ గొట్టేవాడు.

అతను కొట్టినప్పుడు తను ఏడుస్తుంటే రాజమ్మ అమ్మా, సుబ్బయ్య కాపూ ఇద్దరూ రాగోల్ని చడామడా తిట్టేవాళ్లు.

వాళ్లు లేనప్పుడో, చూడనప్పుడో అతని చేతిలో తనకి తన్నులు పడుతూనే వుండేవి.

ఏ మాటకి ఆమాటే చెప్పుకోవాలి. రాగోలు ఎంత పోకిరీవాడో, అంత మంచివాడు కూడా!

రోజూ గాదెలో తవ్వతోనో, సోలతోనో గింజలు చిల్లరకొట్టుకి తీసకపోయి బెల్లం, శనగపప్పు కొని తెచ్చు కునేవాడు.

ఆ కొనుక్కున్న వాటిలో తనకి సగం, గుబులు మళ్లితే ఒక్కోసారి సగానికంటే ఎక్కువ కూడా పెట్టే వాడు.

ఎప్పుడైనా తనకి వద్దని చెప్పి తినకుండా వుంటే అవి తినేవరకూ కొట్టేవాడు. ఇంట్లో ఏమైనా చేసుకున్నా సరే తీసుకొచ్చి తనకి తిన్నంత పెట్టేవాడు.

సుబ్బయ్య కాపుకి మూడు ఎకరాలు పొలం వుంది.

దున్నపోతుల అరక. జత బరిగొడ్లు ఎప్పుడూ వుండేవి.

ఇల్లు పూరిల్లు.

ఊళ్లో చాలామంది సుబ్బయ్యలు వున్నారు. అందుకని ఈయనని గుర్తుగా పూరింటి సుబ్బయ్య అనేవాళ్లు చాలామంది.

తనకి పధ్నాలుగో ఏడు వచ్చేవరకూ డబ్బు ఏమీ లేకుండా పొట్టకూటికే జీతం చేశాడు.

జీతం చేయడం మొదలుపెట్టి ఆరేళ్లు పూరికే చేసిన తరువాత అమ్మా అయ్యా ఇద్దరూ వచ్చి మొండికి పడి అడిగితే సుబ్బయ్యకాపు ఏడాదికి పది రూపా యలు జీతం ఇవ్వడానికి వప్పుకున్నాడు. అప్పుడు అదే ఘనం! మొదటి ఏడాది పది రూపాయలు, రెండో ఏడాది ఇరవై రూపాయలు!

మూడో ఏడాదికి తనకి పదిహేడు వచ్చింది. మేడి పట్టాడు! తన జీతం ఒక్కసారిగా యాభై రూపాయలు అయింది.

తనకి ఇరవయ్యో ఏడు వచ్చేసరికి జీతం రెండు వందలు అయింది. రెండు వందలంటే తనకి ఎక్కువ జీతం ఇస్తున్నట్టే లెక్క!

కాపుకి వున్న మూడెకరాల పొలంతోపాటు దేవుడి మాన్యాలు ఎనిమిది ఎకరాలు కౌలుకి తీసుకుని చేస్తున్నాడు. అండగా తను వున్నాడు.

తన అయ్యా అమ్మతో పాటు తమ ఇంట్లో వాళ్లు కూడా కాపు పనిలో వుండేవాళ్లు. కాపు చేలో పని వుందంటే మరొకరికి ఎంత కూలి ఇస్తామన్నా పోయే వాళ్లు కాదు.

ఎంత వత్తిడీ, గత్తరలో కూడా కాపు కూలిమనిషి కోసం వెదుకులాడుకునే అవసరం వుండేది కాదు.

ఎక్కువ జీతం ఇస్తాం రమ్మనమని వూళ్లోని రైతులు కొందరు అడిగారు కానీ తను వెళ్లలేదు.

కాపుకీ, తమకీ మధ్య మాట కలిసింది. మంచి తనం కలిగింది. పైగా ఆయన తమ ఇంటి ఆసామి! ఆయనని వదిలి ఇంకొకరి దగ్గరకి ఎందుకుపోవాలి?

ఇరవై రెండో ఏడు నడుస్తుండగా మేనమామ కూతురు మరియమ్మతో తనకి పెళ్లి జరిగింది.

పెళ్లయిన ఒక్క ఏడే తను జీతం లేకుండా ఇంటి దగ్గర వుంది. ఇంటి దగ్గర వున్నా వాళ్ల పనికి వెళ్లేవాడు.

రేత్రిపూట ఎద్దుల దగ్గరకి వెళ్లేవాళ్లు లేకా, అరక కట్టే మనిషి లేకా ఆ ఏడాది వాళ్లు పడిన బాధలు అన్నీ ఇన్నీ అని చెప్పలేం.

ఏడాది తరువాత మామూలే! తిరిగి జీతానికి వెళ్లాడు. తను జీతానికి వచ్చేవరకూ తండ్రీ కొడుకులు ఇద్దరూ వూరుకోలేదు.

ఊళ్లో అందరూ తనని మంచి పనివాడిగా చెప్పు కుంటారు.

కాపే తనకి పనులు అన్నీ వైనంగా, బాగా నేర్పాడు.

తను నాగటికొంౡ వేసాడంటే తిరుగులేదు. అంగుళం వంకరపోయేది కాదు.

వాములేయడం, కుప్పలేయడం, తాడు అల్లడం, తట్ట అల్లడం, గొడ్లని మేపడం ఒకటేమిటి తనకి చేతకాని పనిలేదు.

శుద్ధంగా, చూడ చక్కగా చేయడమే కాదు, తను ఇద్దరు మనుషుల పెట్టు పని చేస్తాడంటారు అందరూ!

రాగోలుకి చదువు అబ్బలేదు. నాలుగు తరగతులు చదువుకుని, కొద్దికాలం పనీపాటా లేకుండా గాలెత్తనంగా తిరిగినా చివరికి పొలం పనుల్లోనికి దిగాడు.

తనే పనివాడు అనుకుంటే రాగోలు తనకి పనిలో పోటీ ఇచ్చేవాడు.

రాగోలూ తనూ కలిసి ఏ పనైనా అవలీలగా చేసే వాళ్లు. ఎంత పనైనా పిండి కావాల్సిందే!

వళ్లు దాచుకోవడం అంటే ఏమిటో తనకి తెలీదు. పెట్టుపోతల్లో కాపులు వెనకాడేవాళ్లు కాదు! గింజల కల్లాలప్పుడు అయ్య ఆరుమూరల కండువా పరిస్తే దాన్నిండా రాగోలు కానీ, సుబ్బయ్య కాపు కానీ గింజలు పెట్టేవాళ్లు.

పొలంలో పండే గోంగూర, వంకాయ, పచ్చి మిరపకాయ విషయం చెప్పే పనిలేదు. వాళ్ల పొలంలో

పండే ఏ పంట అయినా కొద్దో గొప్పో తమ ఇంటికి చేరాలి.

తమకి దూడ వుంటే పనిచేసి ఇంటికి పోతూ అయ్య వాళ్ల గొడ్ల దగ్గర మేసిన తొక్కుడుదంటు రోజూ మోపు కట్టుకుని వెళ్లేవాడు.

చాలామంది రైతులు కూలోళ్లకి గింజలు కాదు గదా, పచ్చి మిరపకాయ తొడిమ కూడా పెట్టరు. కూలి డబ్బుల వరకే ఇస్తారు. అంతే.

"కాపా... మీకు పొలం తక్కువ. అంతా మగతా పొలమాయె! వాళ్లకి మగతా కట్టాలి కదా! ముగ్గురు మడుసులు ఎందుకు? మీ ఇద్దరూ చేసుకోకూడదూ, నేను ఇంకో ఇంటి దగ్గర కుదురుతాను," అన్నాడు తను ఒకసారి మాటల సందర్భంలో.

సుబ్బయ్య కాపూ, రాగోలూ ఇంతెత్తున లేచారు తన మీదకి, కొట్టినంత పని చేశారు.

"మగతా పొలం అయితే మాత్రం పని చేయక పోతే పండిద్దంట్రా? నిన్ను వూరక కూసోబెట్టి జీతం ఇస్తున్నాం? ముగ్గురం వున్నా వూరక ఎప్పుడు వుంటన్నాం? ముగ్గురికీ పని సరిపోతానే వుండె!" అన్నారు ఇద్దరూ.

మరుసటి ఏడు ఇంకో ఐదెకరాలు దేవుడి మాన్యం చౌకగా వస్తుంటే కౌలుకి తీసుకున్నారు.

పని అదునులో చేసుకోవడం, వైనంగా చేసుకోవడంతో ఏ ఏటికా ఏడు పంటలు ఇబ్బిడిముబ్బిడిగా పండుతున్నాయి. డబ్బులు దండిగా వస్తున్నాయి.

'రేయ్... అందరూ పూరింటి సుబ్బయ్య అంటన్నార్రా! దమ్మిడీకి కొరగాని ఎదవ కూడా పూరింటి సుబ్బయ్య అంటా మిడిసిపడతన్నార్రా! ఇయ్యేడు బొవింతి వెయ్యాలి!" అన్నాడు సుబ్బయ్య కాపు ఒక రోజు.

"వెయ్యాలి కాపా! బొవింతి వెయ్యాలీ, రాగోలుకి పెళ్లి చేయాలీ!" అన్నాడు తను.

బొవింతి కోసం వూరి ప్రక్కనే అర ఎకరం పొలం కొన్నాడు.

పనిలోకి దిగాం.

మంచి కోడెదూడలు వున్నాయి. బండి వుంది.

బాడిగ లేకుండా మట్టీ, రాయీ రప్పా, కలప, బొంగులు అన్నీ సొంతంగా తోలుకున్నాం.

కొద్దిరోజుల్లోనే అదిరిపోయేలా ఐదు దూలాల బొవింతి లేచింది.

అంతా టేకు సామాను. ఇంతమాత్రం బొవింతి వూళ్లో లేదు.

తమది ఒంటి నిట్టాడి తడికల పూరి గుడిసె.

అందరూ పనులకిపోతే, తడికల్లోనించి సందు చేసుకుని పందులు, కుక్కలు ఇంట్లోకి జొరబడి ఆగం ఆగం చేసేవి.

రాయి పెట్టి, గట్టి గోడలు కట్టి పూరికప్పు వేసు కుందామని తన కోరిక!

రాయి కాదు, పాటిమట్టి గోడలు కట్టుకుందా మన్నా తనవల్ల కావడంలేదు.

మరియమ్మకి కాన్పు జరిగి ఇంటి దగ్గర వుంటే తన జీతం మరియమ్మ తింటానికి సరిపోయింది.

జీతం కూడా అందరి జీతగాళ్లకంటే తనకి పది రూపాయలు ఎక్కువ ఇచ్చినా ఏం లాభం?

ఏం పెట్టి తను గోడలు కట్టుకుంటాడు?

బొవింతి అయిన తరువాత రంగరంగ వైభోగంగా రాగోలుకి పెళ్లి జరిగింది.

రాగోలు భార్య కాంతమ్మ. మంచి మనిషి.

ఆమె కూడా మాతో పాటు కలిసి పనిచేసేది.

ఏడాది గడిచింది.

ప్రక్క చేను మూడు ఎకరాలు బేరానికి వస్తే, ఒకేసారి కొనుగోలు చేశాడు రాగోలు.

సుబ్బయ్య కాపు పెత్తనం రాగోలుకి ఇచ్చి తను తప్పుకున్నాడు. పొలం రావడం కూడా తగ్గించాడు.

రాగోలు గుండె ధైర్యం పెద్దది!

ఒకేసారి మూడు ఎకరాలు కొనుగోలు చేయడంతో బొవింతి కట్టిన వేళావిశేషమో, కాంతమ్మ కాలు పెడుతూ తీసుకొచ్చిన అదృష్టమో రాగోలు వాళ్ల దశ తిరిగిందని వూళ్లో జనం అనుకున్నారు.

కౌలు పొలం పదమూడు ఎకరాలు, సొంత పొలం ఆరు ఎకరాలు అయింది. మొత్తం 19 ఎకరాలు సాగులో వుంది.

తరువాత ఏడు రెండు ఎకరాలు పొలం కొన్నాడు రాగోలు.

పొలంలో డబ్బులు వస్తున్నాయి.

పొలం ఎవరిదైనా బేరానికి వస్తే డబ్బు చాలక పోతే ఎంత అప్పు చేసైనా పొలం కొనేవాడు. తను పూతం ఇచ్చేవాడు. తరువాత వసూళ్లలో అప్పు తీర్చేవాడు.

పొలం కొనేటప్పుడు మంచీసెబ్బరా తనతో మాట్లాడేవాడు. తన సలా తీసుకునే పొలం కొనేవాడు.

పెద్ద చదరాలు కాకపోయినా ఎకరం, రెండ కరాలు చౌకగా పొలం వస్తుందనుకుంటే కళ్లు మూసు కుని కొన్నాడు రాగోలు.

దానికి తగినట్టే పొలంలో పంటలు కూడా అందరికంటే మిన్నగా పండుతుండేవి.

ఏనాడూ పొలం కొంటే భారం అనిపించలేదు.

ఏళ్లు గడుస్తున్నాయి.

రోజులు సాఫీగా సాగుతూ అన్నీ అనుకూలంగా వుండి, పట్టిందంతా బంగారం అవుతున్న కాలంలో సుబ్బయ్య కాపు కాలం చేశాడు. రాజమ్మ అమ్మ మంచాన పడింది.

ఇద్దరూ వయసు వుడిగినవాళ్లు కాబట్టి లెక్కలేదు కానీ, వరిగడ్డి బండి తోలుకొస్తూ రాగోలు కాలు జారి బండి మీద నించి పడ్డాడు. తుంటి ఎముక విరిగింది.

రాగోల్ని ఆస్పత్రిలో చేర్చారు. ఇప్పుడిప్పుడే నడిచే అవకాశం లేదని వైద్యులు చెప్పారు.

ఏడాదిన్నరలోనే ఇవి జరిగాయి.

ఓలిఓలి అంటే పోలిపోలి అనుకునే జనం ఇంకే ముంది రాగోలు వాళ్ల పని ఇక వెనక్కి తిరిగినట్టే అనుకున్నారు. నిచ్చెనమెట్లు ఎక్కినట్టు ఎంత తొందరగా పైకి వచ్చారో, అంత తొందరగానే వాళ్ల దశ తిరగబడటం ఖాయం అనుకున్నారు.

పిల్లలు ఇద్దరూ చిన్నవాళ్లు. చదువుకుంటున్నారు.

రాగోలుకి అవసరమైన మంచిచెడ్డలు చూడ్డానికి కాంతమ్మ ఇంటి దగ్గర వుండాలి.

ఇంట్లో పొలం వచ్చేవాళ్లు ఎవరూ లేరు.

"నా పని అయిపోయినట్టే! ఇంక లేచి నడిచేది లేదు. పొలం ఏం చేద్దాంరా?" ఏమీ పాలుపోక రాగోలు తనని పిలిచి అడిగాడు, కళ్లనీళ్లు పెట్టుకుంటూ.

"చేసేదేంది రాగోలా? నువ్వు రాకపోతే నేను చెయ్యలేనా? ఇన్నేళ్ల నించీ నువ్వు రోజూ వస్తంటేనే నీ పొలం పండింది. పొలం ఎవారం నాకు వదిలిపెట్టి నువ్వు నిశ్చింతగా వుండు" అన్నాడు తను.

"కాంతాం కూడా రాటానికి వల్లకాదు. ఇంటో ఒకరికి ఇద్దరం మంచంలో పడితిమి. మనది దగ్గరా దాపూ పొలంకాదు. ఒక వూరికి పోయి వచ్చినట్టేనాయె!"

"అయితే ఏమైంది రాగోలా?"

"కాంతాం కూడా రాకుండా కూలోళ్లతో పని చేయించాలన్నా కష్టమే కదరా?"

"కష్టం లేదూ, నష్టం లేదు. నువ్వు దిగులు పడవాకు. కూలోళ్లని మా ఆడది తీసకపోయి పని చేయిచ్చిద్దిలే!" అని తను భరోసా ఇచ్చాడు.

మరియమ్మకి నాలుగో కాన్పు జరిగి అప్పటికి మూడు నెలలు కూడా నిండలేదు.

అయినా పాలు తాగే పసిబిడ్డని వదిలిపెట్టి కూలోళ్లని తీసుకుపోయి విత్తనం నాటించింది. నాట్లు వేయించింది. కలుపు తీయించింది. కోత కోయించింది. పంట నూర్పించింది.

ఒక పంట కాదు, ఒక పైరు కాదు.

తనకి ఎద్దులు, అరక, సేద్యంలాంటి పై పనులతోనే సరిపోయేది.

ఇంటివాళ్లు ఎవరూ పొలంలో అడుగుపెట్టకుండానే, తామిద్దరూ రెండేళ్లు చేసీ, కూలీలతో చేయించీ బంగారం పండించారు.

బరువు తమ మీద పెట్టడంతో రెక్కలు ముక్కలయ్యేలా చాకిరీ చేసి అందరికంటే మిగులుగానే పంట పండించారు.

తమ పంటని చూసి ఇరుగుపొరుగు పొలాల రైతులకి కన్ను కుట్టినట్టయింది.

"సొంతోడిక్కూడా నీ అంత తపన వుండదురా! నీ అసుంటి జీతగాడు దొరకడం వాళ్ల అదృష్టంరా! కుడుము ఇస్తే పండుగ అనుకునేవాడివిరా నువ్వు!" అని తనని ఎంతోమంది పొగిడారు.

తను ఆ పొగడ్తలకి పొంగిపోలేదు.

పని చేయకుండా ఎవరైనా వూరక జీతం ఇస్తారా?

ఒకరికంటే ఒక వందో, రెండొందలో ఎక్కువే జీతం ఇస్తున్నాడు కానీ రాగోలు తనని చిన్నచూపు ఎప్పుడూ చూడలేదు.

తనని పొగిడిన రైతులు వాళ్ల జీతగాళ్లని కుక్కల కంటే హీనంగా చూసేవాళ్లు.

ఇతర జీతగాళ్లతో పోలిస్తే తను రాజే! తన మాటకి ఎదురులేదు. తన పనికి తిరుగులేదు. రాగోలు పెట్టుపోతలకి వంకే లేదు.

పంటలు ఇంటికి వచ్చిన తరువాత రాగోలు ఒక గోతం జొన్నలు, ఒక గోతం వరిగలు, ఒక మూట కందులు తమకి పెట్టాడు.

కాంతమ్మ మరియమ్మకి ఒక చీర కొని పెట్టింది.

కాలు బాగు అయిన తరువాత కూడా రాగోలు పొలం రావడం బాగా తగ్గించాడు. భుజాన జరీ కండువా వేసుకుని వూళ్లో పెత్తనాలు చేసేవాడు.

కాపు ఉన్నప్పుడు కూడా అంతే!

వస్తే నాగా లేకుండా పొలం వచ్చి ఇరగా మురగా చేసేవాడు. ఎగనామం పెడితే అంతే! పొలం కల్లి కన్నెత్తి చూసేవాడు కాదు.

రాగోలు పొలం వచ్చినా, రాకపోయినా తాను అన్నీ సముదాయించుకుని పోయేవాడు.

ఇరవై మూడు ఎకరాలు సొంత పొలం, కౌలు పొలం కూడా వదలకుండా చేస్తున్నాడు.

*

రాగోలు పెద్ద కొడుకు సుబ్బరావు ఐదారేళ్ల నించీ పొలం రావడం మొదలుపెట్టాడు.

తన కళ్ల ముందే పుట్టి పెరిగిన సుబ్బరావుకి ఇప్పుడు 30 ఏళ్లు! తన భుజాల మీదనే పెరిగాడు!

తాత పేరు పెట్టినా తాత పద్ధతి ఒక్కటీ రాలేదు.

తాగడం, చీట్లపేక అడ్డం, తిరగడం! ఒక మంచి బుద్ధి లేదు.

చదువుకని పట్టణం పోయి చాలా డబ్బు తగలేసి చండాలపు బుద్ధులు నేర్చుకుని వచ్చాడు. సుబ్బరావు తమ్ముడు రాజారావు పెద్ద చదువు చదువుకుని పెద్ద ఉజ్జోగస్తుడయ్యాడు.

సుబ్బరావు భార్య రాణి.

ఆమెకి పొలం ఎక్కడ వుందో, ఎలా వుంటుందో తెలియదు.

ఇంటి దగ్గర వంట చేయడం, టీవీల్లో బొమ్మలు చూడ్డం రాణి పని.

వయసు పెరిగినా, అప్పుడప్పుడూ కాంతమ్మే పొలం వస్తూ చూసుకుంటుంది.

రెండేళ్ల నించీ తనకి దగ్గు జబ్బు పట్టుకుంది. నెమ్ము. ఒకటే దగ్గు. నీరసం! కళ్లెపడటం, అప్పుడప్పుడూ నెత్తురు పడటం!

జీతం చేయడం మానుకుందాం అనుకుంటూనే మరో దారి లేక అలాగే నెట్టుకుంటూ వస్తన్నాడు.

ఇయ్యేడు ఇక తప్పదు.

తిండి అమరిక కూడా సరిగా లేదు.

రాణి ఏడుస్తూనే జీతగాళ్లకి వడ్డిస్తుంది. పెట్టే టప్పుడు గొణుగుతూనే వుంటుంది. ఏనాడూ ఆమె సంతోషంగా తిండి పెట్టలేదు.

కాంతమ్మ అయితే కన్నతల్లిలా బాగానే పెట్టే మనిషి.

జీతగాళ్లు కొత్తగా కుదిరినా, మానుకున్నా, మరో ఆసామి దగ్గరకి పోయినా ఏరువాక పున్నమికే మొదలు!

ఏరువాక వచ్చింది.

''ఇంక నేను జీతం చేయలేను సుబ్బరావు. ఇంటికి యెల్తాను ఇయ్యేడు!'' అన్నాడు తను.

''అట్నే పో,'' అన్నాడు సుబ్బరావు.

కనీసం మాటసాలుగా వుండమనే మాట కూడా అనలేదు. తను పని చేయలేకపోతున్నప్పుడు ఎందుకు దండగ అనుకున్నాడు, ముసలి ఎద్దుకి మేత దండగ అనుకున్నట్టు!

''నేను కాపరానికి వచ్చి నలబయ్యారేళ్లయింది. నేను కాపరానికి రాక ముందు పదీ పన్నేండేళ్లు వుంటివీ! ఇంకో ఇంటి గడప తొక్కకుండా ఇంతకాలం జీతం చేసినోళ్లు ఎవురున్నారు? జీతం మానుకుంటే నీకూ మాకూ రుణం తీరిపోయిందనుకోవాకు. ఇంటికల్లి వచ్చి పోతుండు,'' అంది కాంతమ్మ.

గుడ్డలు సర్దుకుని, కంచం, మంచినీళ్లు తాగే చెంబూ తీసుకుని ఇంటికి వచ్చేశాడు తను.

రాగోలూ, కాంతమ్మా మాత్రం బాధపడ్డారు.

పిల్లలు అందరూ వేరుపడి ఎవరి సొలెడు వాళ్లు కాసుకుంటున్నారు.

తనూ, మరియమ్మే ఇప్పుడు.

తరచూ తను రాగోలు వాళ్ల ఇంటికి వెళ్లి వస్తున్నాడు.

''చల్లనీళ్లకి ఇబ్బందిగా వుంది కాంతమ్మా! ఎండా కాలం. పున్నీళ్లు తాగలేక అల్లాడిపోతన్నాను. నాకు పున్నీళ్లు తాగే అలవాటు కూడా లేదు. రాజమ్మ అమ్మ కానీ, నువ్వు కానీ చిన్నప్పట్నించీ కమ్మటి చల్లపోస్తే తాగినోడ్ని అయితిని,'' అన్నాడు తను ఒకరోజు.

''రోజూవచ్చి చల్లపోయించుకుని పో దాయిదూ! నీకు చల్లనీళ్లు పోయలేమా ఏంది?'' అంది కాంతమ్మ.

మరియమ్మ పొద్దున్నే పొగాకు కంపినీలో గ్రేడు పనికిపోతుంది.

తనే రోజూ తపేళా తీసుకుని రాగోలు వాళ్లింటికి చల్ల కోసం వెళ్లేవాడు.

వెళ్లి గొడ్ల దగ్గిర పేడకళ్లు తీసి కసువు వూడ్చడం, కుడితి పెట్టి కట్టెయ్యడం, ఏదయినా చిన్నపనీ, పెద్ద పనీ అవసరమైనప్పుడు చెయ్యడం!

కాంతమ్మ చిక్కటి చల్ల పోసేది. కాంతమ్మ లేనప్పుడు రాణి మాత్రం తపేళా కడిగిన అడుగూ బడుగూ నీళ్లే పోసేది.

పండగా పబ్బం అయితే కాంతమ్మ అప్పిచ్చులు ఇంటికి తీసుకుపొమ్మని గిన్నెడు పెట్టేది. పచ్చడీ, కూరా నారా పెట్టేది.

కాంతమ్మ సొమ్ము అంతా తనకి ధారాదత్తం చేసినట్టు రాణి రుసరుసలాడుతుండేది.

వయసు పెద్దదవడంతో కాంతమ్మ పెత్తనం నెమ్మదిగా తగ్గిపోయింది. పట్టించుకోవడం మానేసింది.

తనకి దగ్గు ఎక్కువైపోయింది. ఆస్పత్రికి పోయి చూపెట్టుకుందామంటే కొడుకులు అందరూ తమ దగ్గర పైసా లేదన్నారు.

నలుగురు కొడుకులకీ, ఒక కూతురికీ పెళ్లీ, పేరంటాలు చేసీ, సాకి సంరక్షణ చేస్తే చివరికి ముసలి వాళ్ల వూసే పట్టించుకోవడం మానేశారు.

రాగోల్ని అడుగుదామంటే డబ్బు పెత్తనం కొడుక్కి ఎప్పుడో వప్పగించాడు.

సుబ్బరావు పేకాటలో పదివందలైనా పెడతాడు కానీ ఎవరికైనా పది రూపాయలు ఇవ్వడానికి గిజగిజ లాడిపోతాడు.

ఆస్పత్రిలో చూపెట్టుకోవడానికీ, మందులకీ మాకులకీ వందన్నా కావాలి.

సుబ్బరావునే అడగాలి.

ఏమంటాడో?

మరియమ్మకి కంపినీ డబ్బులు ఇచ్చినప్పుడు రెండుసార్లు రెండు యాబయిలు తిరిగి ఇవ్వొచ్చు!

"దగ్గు ఎక్కువైపోయింది సుబ్బరావు. రేత్రిపూట వూపిరాట్టంలా! ఒకటే దగ్గు. మొన్న నెత్తురు కూడా పడింది. వంద రూపాయలు అప్పియ్యి! ముసిల్దానికి కంపినీ డబ్బులు రాంగానే రెండుసార్లుగా తిరిగిస్తా!" సుబ్బరావుని అడిగాడు తను.

కాంతమ్మ కూడా అక్కడే మంచం మీద కూర్చుని వుంది.

"నా దగ్గిర ఇప్పుడు డబ్బులు ఎక్కడున్నయ్యిరా దాయాదూ! మాకే కటకటగా వుంటే!"

"అదేందబ్బాయి అట్టంటావు? వేలు అడిగాడా, లక్షలు అడిగాడా? వంద రూపాయలు ఇయ్యడాని కేం?" అంది కాంతమ్మ.

"ఏ సీజన్ అని డబ్బులు వుంటయ్యమ్మా? డబ్బు అంతా పొలానికే పెట్టుబడి పెడితిమీ!"

"వంద రూపాయులు కూడా లేకుండానే కాపరాలు చేస్తన్నారన్నమాట అయితే!" అంది కాంతమ్మ నిష్ఠూరంగా.

"తెచ్చి ఇయ్యరాదూ... నడి మంచం మీద కూర్చుని మాటలు చెప్పడానికేం? ఈదేవాడికి తెలిసిద్ది లోతు, గట్టు మీద వాడికేం తెలిసిద్ది? డబ్బు ఇచ్చినా రేపు ఆ ముసిలోడు ఇచ్చేదేందో పెట్టేదేందో!" అంది రాణి.

"తిరిగి ఇయ్యకపోతేనేం? మనం వంద రూపా యలు వూరక ఇయ్యలేమా? ఎంత రావడంలేదూ, పోవడం లేదూ! రోగమొచ్చింది చూపెట్టుకుంటానంటే అప్పుగా వంద రూపాయలు ఇయ్యటానికి గింజు కుంటారెందుకు?" అంది కాంతమ్మ కోపంగా.

మాటా మాటా పెరిగింది.

"నాకోసం మీరెందుకమ్మా తగువు పట్టం? మీరు ఇవ్వొద్దూ, ఏం వద్దూ!" అన్నాడు తను.

తగాదా ఆగలేదు. చినుకు చినుకే గాలివాన అయింది. పెద్ద మనుషులు చేరి సర్దిపుచ్చారు.

తను రోజూ చల్లకోసం వెళ్తూనే వున్నాడు.

తనని చూస్తే రాణి చిర్రుబుర్రులాడుతుంటుంది.

అప్పటివరకూ నిల్వచేసిన శనగలూ, మిను ములూ ధర రావడంతో ఒకరోజు అమ్మాడు సుబ్బరావు.

రెండు జల్లెడలు వేసిన తరువాత వచ్చిన రాయి, మట్టిగెడ్డ కలిసి వున్న గింజలూ, పొట్టూ, తాలూ తరకా ఇవన్నీ బాగు చేయడానికి తనకీ, కాంతమ్మకీ మజ్జాన్నం దాకా పట్టింది.

ఎండబడటంతో కాంతమ్మ అన్నం పెట్టింది. తిని బయల్దేరాడు తను.

"ఉండు దాయిదూ..." తనతో అని, "అమ్మాయి అనూషా... ఇంటో నించి తెల్లకాగితం గోతం ఒకటి తీసక రామ్మా! దాయిదుకి అడ్డెడు శనగలూ, మినుములూ పెడదాం!" మనవరాలికి చెప్పింది కాంతమ్మ.

ఆ అమ్మాయి లోపల నించి గోతం తీసుకుని వస్తుంటే, రాణి చూసి గోతం కూతురి చేతిలోనిది లాక్కుని నాలుగు తిట్లు తిట్టి బయటికి వచ్చింది.

"తరువాత నేను పెడతాలే అత్తా దాయిదుకీ..." అంది రాణి.

"తరవాత ఎందుకూ? ఇప్పుడు నేను పెట్టకూడ దెట్టా?" అంది కాంతమ్మ కోపంగా.

"నేను పెడతాను అన్నాను గదా! ఇప్పుడు నీకు ఎందుకు అంత తొందర?"

"తొందరేందమ్మాయి? ఇప్పుడు పెడితే పోయిద్ది గా! గోతాలు గదిలో యేసిన తరువాత మళ్లీ తీసి పెడతా వెట్టా?"

"శనగలూ, మినుములూ వూరక రాటంలా! కేజీ వచ్చి ముప్పయ్ రూపాయలు పడతన్నాయ్! నీ ఇష్టం వచ్చినట్టు పెడితే తొందరగానే ఆరిపోతాం!"

"కేజీలూ అరకేజీలూ కాదు, పనోళ్లకి గోతాలు పెట్టిన రోజులు వున్నయ్! మేం ఏం ఆరిపోలేదే! నేను కాపరానికి వచ్చినప్పుడు వున్న మూడెకరాల పొలాన్ని ఇరవైమూడు ఎకరాలు చేశాం! పనోళ్లకి పెడితే ఎవురూ

ఆరిపోరు. వాళ్లు అంతకి అంత చాకిరీ చేస్తారూ, అంతకు అంత కలిసి వచ్చిద్ది!"

తగాదా రాజుకుంది.

కాంతమ్మని పట్టుకుని ఎంత మాట పడితే అంత మాట అంది రాణి.

రాగోలు బయటినించి వచ్చాడు. ఆయన్ని కూడా లెక్కలేకుండా మాట్లాడింది.

ఇంతలో సుబ్బరావు వచ్చాడు.

"ఓరేయ్... విన్నావా? నీ పెళ్లాం పెద్దంతరం చిన్నంతరం కూడా లేకుండా నోటికి ఏ మాట వస్తే ఆ మాట అంటంది! ఇంక కలిసి వుంటం జరిగే పనికాదు. ఎవరి సోలెడు వాళ్లం కాసుకుందాం. మీ తాత ఇచ్చిన గొర్రులో నీ వాటా తీసుకుని వేరుగా వుండు. పొలం అంతా నేను సంపాయించుకుంది. నా అనంతరం నువ్వూ, మీ తమ్ముడూ ఎట్నో చేసుకోండి. మీరు గౌరవంగా వుంటే మీకిస్తా, లేకపోతే దారిన పొయ్యే ఏ దానయ్యకో ఇచ్చినా నన్ను అడిగేవాళ్లు లేరు," అన్నాడు రాగోలు.

"ఇచ్చుకో, నీ ఆస్తికి ఎవుడు ఆశపడ్డాడు? మేం సంపాయించుకోలేమా ఏంది? ఇక్కడ నీ బెదిరింపులకి ఎవరూ భయపడరు!" అని రాణి రాగోల్ని ఎదిరించింది.

సుబ్బరావు వారిస్తున్నాడు. అయినా రాణి వినకుండా పెట్రేగిపోయింది. భర్తని కూడా తిడుతూ, పెద్దగా అరుస్తూ, హీనపరుస్తూ మాట్లాడటం మొదలుపెట్టింది.

"ఏమేయ్... అద్దూ ఆపూ లేకుండా బరితెగించి మాట్లాడతన్నావూ..." అంటూ రాణి జుట్టు పట్టుకుని వంగతీసి దభీదభీమని పిడిగుద్దులు గుద్దేడు సుబ్బరావు.

రాత్రి పేకాటలో పోగొట్టుకున్న డబ్బు కోపం కూడా కలిసింది.

రాగోలూ, కాంతమ్మా తప్పిస్తున్నా వినకుండా రాణిని రేలగొట్టాడు.

తను అక్కడ వుండటం బాగుండదని లేచి వచ్చాడు.

వారంరోజులు వాళ్ల ఇంటివైపు వెళ్లలేదు.

కాంతమ్మ మనిషిని పంపించింది.

ఏదో పని మీద పల్లెలోనికి వచ్చిన రాగోలు తన దగ్గరకి వచ్చి అడిగాడు.

"ఏరా దాయిదూ... ఇంటి కల్లి రావటం లేదు ఎందుకూ? మా కోడలితో ఎప్పుడూ వుండే జాతరే లేరా! కొత్తేంకాదు. నీకెందుకు, నువ్వు వచ్చిపోతండ్రా."

తను నసుగుతూ నిలబడ్డాడు.

"ఏందిరా... నీ... ఎహై పద!" పెద్ద బూతుమాట అని కోప్పడి, తను కదిలిందాకా కదల్లేదు.

ఆయన ముందూ, తను వెనుకా వెళ్లారు.

"దాయిదూ... మేం బతికి వున్నంతకాలం నువ్వు మా ఇంటికి రావటం మానుకోవాకు. ఇది మేం కట్టించుకున్న ఇల్లు. ఎవరేమన్నా నువ్వు పట్టిచ్చుకోవాల్సిన పని లేదు. మేం చచ్చామనుకుంటేనే నువ్వు మా ఇంటికి రాకుండా వుండు!" అంది కాంతమ్మ.

తను వద్దంటున్నా వినకుండా రెండు మూటల్లో శనగలూ, మినుములూ కట్టి ఇచ్చింది.

రాణి తన మీద గొంతు దాకా కసి పెంచుకుని వుంది. ఆమె పంతం నెగ్గడంలేదనీ, భర్త చేతిలో తన వలనే దెబ్బలు పడ్డాయని ఆమె కోపం.

ఒకరోజు పొద్దున్నే ఇంటి ముందూ, ఇంటి వెనుకా పిచ్చిమొక్కలూ, గడ్డీగాదం, గరికా పెరిగి వుంటే తనూ, కాంతమ్మా నేల అంతా బాగు చేశారు.

"కూరకి ఇబ్బందిగా వుంది కాంతమ్మా!" అన్నాడు తను.

కాంతమ్మ ఇంట్లోకి పోయి తవ్వెడు కందిపప్పు తీసుకొచ్చి తన కండువాలో పోసింది.

"నువ్వు పెట్టదల్చుకుంటే కందులు పెట్టుకో! కందిపప్పు పెడితే ఎట్ట? కందులు యేపీ, యిసిరీ పప్పు చేసేసరికి నడుములు పోతన్నయ్యి!" అంది రాణి.

"నువ్వు చెయ్యవాకు, ఈసారినించీ నేను చేసుకుంటాలే! దావీదుకి వూరకపెట్టలా! పొద్దుట్నించీ వంచిన నడుం ఎత్తకుండా ఇంటి ముందూ, వెనకా అడిపి అయి వుంటే బాగుచేశాడు. ఆ పిచ్చిమొక్కల్లో పురుగూ పుట్రా వుండా దిక్కులేదు! పిల్లలు తిరిగే ఇల్లు," అంది కాంతమ్మ.

రాణి నోటిమనిషి. వూరుకోలేదు. ఏదో మాట్లాడుతూనే వుంది. తను లేచి వచ్చాడు.

*

ఇయ్యాల పొద్దున కాంతమ్మ మంచం మీద కూర్చుని ఏదో యవారం చెపుతుంటే నేల మీద గుంజని ఆనుకుని కూర్చుని తను వింటున్నాడు.

సుబ్బరావు కూతురు ప్రయివేటు నించి వచ్చి పుస్తకాలు పంచలో వుండే మంచం మీద వేసి, బయట సావాసగత్తె వుంటే ఆ అమ్మాయి దగ్గరకి వెళ్లి మాట్లాడి లోపలికొస్తూ తన వెనుక నిలబడి, "ఛీ ఛీ ఛీ," అంటూ పెద్దగా చీదరించుకుంది.

"ఏమైందే?" అంది కాంతమ్మ.

తనూ అటు చూశాడు. తన వెనక కొద్ది దూరంలో చీమిడి! పిడికిడయితే ఎవరో చీదారు!

నల్లటి పాలిష్ బండల మీద చీదరగా, పచ్చగా చండాలంగా వుంది.

అంతలో రాణి లోపలనించి వచ్చింది.

"ఎవరే ఇక్కడ చీదిందీ?" ఆ అమ్మాయి తల్లిని అడిగింది.

"ఇంకెవురూ... ఈ ముసిలోడే! ఏరా దాయిదూ... ఎక్కడా నువ్వు చీదేది? ఇది ఇల్లనుకున్నావా, ఏమను కున్నావు? చల్లకొచ్చినోడివి వచ్చినట్టు వుండాలి!"

"నేను అసలు చీదలేదమ్మా!" అంటున్నా తన మాటల్ని దూరనివ్వలేదు రాణి.

"నీ కొడుకే చీదాడమ్మాయి ఇందాక. నేను తిట్టాను," అని కాంతమ్మ అంటున్నా రాణి వినలేదు.

"వచ్చిన కాడ్నించీ ఏదో ఒకటి రాబట్టుకోవాలని చూస్తుంటావు. చల్లంటావూ, కూరంటావూ, అయ్యి పెట్టమంటావూ, ఇయ్యి పెట్టమంటావూ, డబ్బులు అడుగుతుంటావూ! నీ అసుంటోళ్లని ఇళ్లకల్లి రానిస్తే తొందరగానే బాగుపడతాం! ముసిలోడివని మేం చూసీ చూడనట్టు పోతంటే నీ ఇష్టం వచ్చినట్టు చేస్తన్నావే!"

"నేనేం చేశాను తల్లీ?"

"ఇంకేం చెయ్యాలి? మేం ధర్మసత్రం పెట్టామా నీకోసం? రోజూ నీకు చల్ల ఎక్కడ్నించి వస్తయ్యి?"

"అట్టంటావేందమ్మాయి?" అని కాంతమ్మ అంటున్నా రాణి తగ్గలేదు.

పెద్దగా మాట్లాడటం మొదలుపెట్టింది.

ఇంతలో లోపలనించి సుబ్బరావు, "రోజూ వాడి దగ్గర మీరు తగాదాపడటం, అరచుకోవటం ఎందుకూ? ముందా ముసిలోడ్ని మెడబట్టి బైటికి గెంటెయ్యవే! ఇంక ఇంటి సాయలకి రాకుండా తరిమికొట్టు!" అంటూ కేకేశాడు. తనకి తల తీసేసినట్టయింది. లేచి వడివడిగా బయటికి వచ్చేశాడు.

సుబ్బయ్య కాపు దగ్గిరా, ఆయన కొడుకు రాగోలు దగ్గిరా, మనవడు సుబ్బరావు దగ్గిరా ఆ ఇంట్లోని మూడు తరాల మనుషుల దగ్గిర తను జీతగాడిగా పనిచేశాడు.

వాళ్ల పొలంలో చాకిరి, వాళ్ల ఇంట్లో వాళ్లకంటే తమ ఇంట్లో వాళ్లే ఎక్కువ చేసారు. వాళ్ల పొలంలో చిందిన చెమటలో ఎక్కువ భాగం తమదే!

అయినా... తమ పూరి గుడిసె అలాగే వుంది. తమ పేదరికం అలాగే వుంది.

ఆనాటి నించీ ఈనాటిదాకా తన బతుకు మార లేదు. పని చెయ్యకుండా ఎప్పుడూ తను వూరుకున్నది లేదు, అయినా తన బతుకులో వెలుగులేదు!

వాళ్లకి... తను జీతానికి వచ్చినప్పుడు మూడు ఎకరాలు సొంత పొలం, పూరి గుడిసె.

ఇప్పుడు... పాతిక ఎకరాల పొలం, బొవింతీ.

తన కళ్ల ముందే... తను జీతం చేస్తుండగనే... వాళ్లు పెద్దవాళ్లయిపోయారు.

రోగం వచ్చి చస్తూ ఆస్పత్రిలో చూపెట్టుకుందా మన్నా వందరూపాయలు గతిలేదు తనకి.

వాళ్లకి ఆస్తి అంతా ఎక్కడ్నించి వచ్చింది? ఎలా వచ్చింది? ఎవరి చాకిరీ వలన వచ్చింది? ఎవరి చెమటతో వాళ్లు పెద్దవాళ్లయ్యారు?

వాళ్ల సొమ్ము తను తిన్నాడా?

తన సొమ్ము వాళ్లు తిన్నారా?

ఎవరి సొమ్ము ఎవరు తిన్నారు?

వాళ్లకి భూములూ, ఇల్లూ వాకిళ్లూ, బిడ్డల చదువులూ, కోరిన తిండీ, గుడ్డా అన్నీ ఎలా వచ్చాయి?

ఆలోచనలతో దావీదుకి వర్షపాతంలా కన్నీళ్లు కారుతున్నాయి. పై గుడ్డతో తుడుచుకుంటున్నా కన్నీళ్లు ఆగడంలేదు.

సుబ్బరావు మాటలే మనసులో శూలాల్లా గుచ్చు కుంటున్నాయి.

*

"ఏం దాయిదు బాబా... ఏందే కళ్లంట నీళ్లు వస్తన్నయి? నీలోనే ఏడుస్తున్నావెందుకు? ఏమైందీ?" అరుగు దగ్గరికి వచ్చిన తమ్ముడు కొడుకు ఆతృతగా, ఆందోళనగా అడిగాడు.

ఆవేదనతో, ఆలోచనతో వేడెక్కి తలలో నరాలు చిట్టిపోతున్నట్లనిపించింది దావీదుకి.

"ఏం లేదురా అబ్బాయి..." అంటూనే దావీదు వెనక్కి వరిగిపోయాడు.

*ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, ఫిబ్రవరి 2003*

